

కార్యక్రమంలో ప్రొఫెసర్ విష్ణువర్ధన్, కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

అధ్యాపకులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలి

- జేఎన్‌టీయూ ప్రొఫెసర్ విష్ణువర్ధన్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ బీ. విష్ణువర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాస్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ అధ్యాపకులు బోధించే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని సూచించారు. సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. ఉన్నత చదువుల్లో రాణించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల నడవడికను గమనిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో లెడ్‌చిప్ ఇండస్ట్రీస్ సీఈవో డాక్టర్. కేవీకే రావు, రామకృష్ణమఠం అధ్యాపకులు శ్యాంమహారాజ్‌స్వామి, కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్. రాంచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, పీఆర్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక విద్యతో ఉన్నత శిఖరాలకు

- టీసీఎస్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్

హయత్‌నగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక విద్యతో ఐటీ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని టీసీఎస్ జనరల్ మేనేజర్ సారంపూడి శ్రీకాంత్ అన్నారు. తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్ ఎంత ముఖ్యమో నిజాయితీ గల జీవితం కూడా అంతే ముఖ్యం అన్నారు. కళాశాల వైస్ చైర్మన్ అనంతుల హ్రిదయరెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తున్నామని తెలిపారు. టెక్నాలజీపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాగర్, కళాశాల సెక్రెటరీ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, చైర్మన్ అనంతుల వినయ్‌కుమార్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ఏపీ మాజీమంత్రి రోజా పూజలు



పూజలు చేస్తున్న సినీనటి, మాజీమంత్రి రోజా

చంపాపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని గురువారం సినీనటి, ఏపీ మాజీ మంత్రి రోజా సం దర్శించారు. ఆలయంలోని వినాయక స్వామి, ధ్యానాంజనేయ స్వామి ఆలయాలలో రోజా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ పండితులు, అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సామూహిక గణపతి హోమం నిర్వహిస్తున్న ఆలయ పండితులు, అర్చకులు

భక్తిశ్రద్ధలతో సామూహిక గణపతి హోమం

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో గురువారం శ్రావణమాసం సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని సామూహిక గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయకస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు, అర్చకులు హోమాన్ని ఘనంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

డీఆర్డీఓ టౌన్‌షిప్ ఎస్టేట్ మేనేజర్‌గా వినోద్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న శాస్త్రవేత్త వినోద్‌కుమార్

చంపాపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని డీఆర్డీఓ టౌన్‌షిప్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ యూనిట్ హైదరాబాద్ ఎస్టేట్ మేనేజర్‌గా శాస్త్రవేత్త (ఎఫ్) వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. అక్కడ ఎస్టేట్ మేనేజర్‌గా పని చేసిన డాక్టర్ షేక్ గౌస్ మొహిద్దీన్ సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ -ఆన్- స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా వెళ్లారు.



ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు చౌకి రవికుమార్
- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



అదానీ, అంబానీ కుంభకోణాలపై దర్యాప్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. చాదర్‌ఘాట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అమరవీరుల స్థూపాన్ని చేరుకుని అక్కడి నుంచి ఈడీ కార్యాలయానికి చేరింది. మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



ఓల్డ్ మలక్‌పేటలోని మున్సిపల్ కాలనీలో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవనం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఓల్డ్‌మలక్‌పేటలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం నూతనంగా నిర్మించారు. నిర్మాణం పూర్తయింది కానీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుత ఆరోగ్యకేంద్రం సీబీ క్వార్టర్స్ కాలనీలోని కమ్యూనిటీ సెంటర్ భవనంలో కొన్నేళ్లుగా కొనసాగుతుంది. ఇక్కడ వైద్య వసతులు సక్రమంగా లేకపోవడంతో మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ స్థలంలో అధునాతన వసతులతో నూతన భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి ఆస్పత్రిని ప్రారంభించి ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి

- జడ్‌సీ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్బీనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కుక్క కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. కుక్కకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జీహెచ్‌ఎంసీ ముద్రించిన కరపత్రాలను ఎల్బీనగర్ జోన్ పరిధిలోని ఉప కమిషనర్లు, పీఓలు, ఎంటమాలజిస్ట్, వెటర్నరీ డీడీలతో కలిసి గురువారం ఆయన విడుదల చేశారు. అనంతరం కుక్కకాటు నియంత్రణపై అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వందశాతం రేబీస్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలు సమీపించినప్పుడు కదలకుండా నిల్చోవాలన్నారు. గొలుసుతో కట్టేసి ఉన్న కుక్కల సమీపానికి వెళ్లకుండా ఉండాలన్నారు. కుక్కలు వస్తుంటే పరుగెత్తకూడదన్నారు. కుక్కలు ఉన్నప్పుడు వాటి పిల్లల దగ్గరికి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో కాప్రా, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ ఉప కమిషనర్లు ముకుంద్‌రెడ్డి, తిప్పర్తి యాదయ్య, జకియా సుల్తానా, సుజాత, డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి విక్రాంత్‌రెడ్డి, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజనీ, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రంజిత్ పాల్గొన్నారు.



కొత్తపేటలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

కొత్తపేట బస్తీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

కొత్తపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బస్తీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు విన్నవించారు. గురువారం ఆయన జోనల్ కమిషనర్‌తో కలిసి కామినేని చౌరస్తా సమీపంలో గల భరత్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ బస్తీల్లో పరిశీలించారు. బస్తీల్లో జలమండలి వారు పనులు చేపట్టిన దారుల్లో మరమ్మతు చర్యలు చేపట్టకపోవడం, వరద కాల్వలు లేక వర్షాల వేళ వరద నీరు దారులను ముంచెత్తడం తదితర సమస్యలను కార్పొరేటర్ ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్ నుంచి ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ వద్ద చేపట్టాల్సిన పైప్‌లైన్ పనుల స్థలాన్ని కార్పొరేటర్ జలమండలి డీజీఎం రవీంద్రనాథ్, రాధాధీరజ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పైప్‌లైన్ అనుసంధానం చేయకపోవడంతో సమస్య జటిలమైందని కార్పొరేటర్లు అభిప్రాయపడ్డారు. జల మండలి వారు సమస్య పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీ సుజాత, ఏఈ మాతృనాయక్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఇతర అధికారులు

రుణమాఫీ పేరుతో రైతులను దగా చేసిన రేవంత్ సర్కార్

- బీఆర్‌ఎస్ నేతల ధ్వజం.. బాలాపూర్‌లో ధర్నా

సరూర్‌నగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను దగా చేసిందని, 40శాతం రుణాలు కూడా మాఫీ కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని బీఆర్‌ఎస్ నేతలు ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం బడంగ్‌పేట్‌లోని బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆపార్టీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఓ మాట.. ఎన్నికల తర్వాత ఓ మాట ఉన్నట్టుగా రాష్ట్రంలో ప్రభుత్వం పనితీరు ఉన్నదని విమర్శించారు. రైతుల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ రైతులను నట్టేట ముంచుతున్నదని ఆయన ఆరోపించారు. రైతులను మోసం చేస్తే వారి ఉసురు ఈ ప్రభుత్వానికి తగిలి తీరుతుందని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ మీర్‌పేట్, జల్‌పల్లి శాఖల అధ్యక్షులు అర్కల కామేశ్‌రెడ్డి, షర్ఫుద్దీన్, భాగ్యనగర్ రైతు సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, సూరెడ్డి కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలాపూర్ మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షులు రాంరెడ్డి, కామేశ్‌రెడ్డి, షర్ఫుద్దీన్ తదితరులు

ఐటీసెల్, ఎస్‌ఓటీ, సీసీఎస్ కార్యాలయాలను సందర్శించిన సీపీ

- సిబ్బందికి పలు సూచనలు ఇచ్చిన సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పలు కేసుల దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను అందించడంతో పాటు, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, డయల్ 100 వంటి అత్యవసర సేవల అమలులో ఐటీ సెల్ పోషిస్తున్న పాత్రను సీపీ సుధీర్‌బాబు అభినందించారు. గురువారం ఎల్బీనగర్‌లోని రాచకొండ ఐటీ సెల్, ఎస్‌ఓటీ, సీసీఎస్ కార్యాలయాల సముదాయాన్ని సందర్శించి ఐటీ సెల్, సోషల్ మీడియా, ఇతర విభాగాల పనితీరును సమీక్షించారు. ఎస్‌ఓటీ కార్యాలయాన్ని సందర్శించిన సీపీ డ్రగ్స్, కల్తీ విత్తనాలను సరఫరా చేసే ముఠాలను ఉక్కుపాదంతో అణచివేయాలని అధికారులకు సూచించారు. సీసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠాలను పట్టుకోవాలని, ఎటువంటి దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్‌గౌడ్, ఏసీపీ రమేష్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



సీసీఎస్ కార్యాలయంలో సీపీ సుధీర్‌బాబు

ఇంటి శుభ్రతతో వ్యాధులకు చెక్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందంటున్నారు చెఫ్ కునాల్ కపూర్. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడానికి వినూత్న పద్ధతులను అనుసరించాలని సూచిస్తున్నారు. వేప నూనెతో ఫ్లోర్‌ను శుభ్రం చేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయంటున్నారు.

ఫ్లోర్ పొడిగా ఉండాలి

వర్షాకాలంలో తేమ అధికంగా ఉంటుంది. తేమ వాతావరణంలో కంటికి కనిపించని సూక్ష్మజీవులు అధికంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి. వీలైనంత వరకు ఫ్లోరింగ్ పొడిగా ఉండేలా చూసుకోవాలి. నునుపుగా ఉండే టైల్స్‌పై నీరు పడితే కాలు జారే ప్రమాదం ఉంటుంది. ఫ్లోరింగ్ తడిగా ఉంటే ఎప్పటికప్పుడు తుడిచివేయడం మంచిది.

డోర్ మ్యాట్స్..

చాలామంది వర్షాకాలంలో డోర్ మ్యాట్స్ తడిచిపోతాయని సరిగా వాడరు. ఈ సీజన్‌లో హెవీ డ్యూటీ రబ్బర్ డోర్ మ్యాట్ బయటవైపు ఉంచడంతోపాటు ఇంటి లోపల నీరు పీల్చుకునే డోర్ మ్యాట్ వాడటం వల్ల ఇల్లు శుభ్రంగా ఉంచుకోవచ్చు.

డాగ్ ప్రేమికులు జాగ్రత్తగా ఉండాలి

ఇటీవల కాలంలో చాలా మంది కుక్కలు లేదా పిల్లులను పెంచుతున్నారు. వర్షాకాలంలో వాటి కాళ్లు తడవడం వల్ల నేలపై మరకలు పడటంతోపాటు వాటికి అంటువ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. వాటి పాదాలు శుభ్రం చేయడంతోపాటు పెట్ ఫ్రెండ్లీ ఫ్లోర్ క్లీనర్ వాడాలి.

యాసిడ్, ఫినాయిల్

ఫ్లోర్‌పై మరకలు పోవడానికి కొంతమంది యాసిడ్, ఇల్లు శుభ్రం చేయడానికి ఫినాయిల్ వాడుతుంటారు. వాటివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. కొంతమందికి చర్మ సమస్యలు లాంటివి రావచ్చు. అనారోగ్యం కలిగించే వాటిని వాడకుండా చర్మ ఆరోగ్యం పాడవకుండా ఉండే, ఘాటు వాసన లేని క్లీనర్స్‌ను వాడితే మంచిది.

- వర్షాకాలంలో మంచాలపై దుప్పట్లను వారాల తరబడి మార్చకపోతే సమస్యలు రావచ్చు. మీతోపాటు మీ పెట్స్ కూడా తాజాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటిలో ఎక్కడా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాకాలంలో తడిచిన దుస్తులు వాసన వస్తుంటాయి. వాటిని ఆరబెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

తలుపులు మూసి ఉంచొద్దు

దోమలు వస్తాయని, జల్లు పడుతుందని ఇంటి తలుపులు, కిటికీలను వర్షాకాలంలో మూసి ఉంచొద్దు. ఇంట్లో ఉన్న తేమ, ఇతర చెడు వాసనలు బయటకు పోవడానికి గాలి ప్రసరించడం అవసరం. ఇంట్లో తేమ నివారణకు హ్యూమిడిఫైయర్లు లేదా ఫ్యాన్లను వాడటం మంచిది.

మహిళ అదృశ్యం



మీనా(ఫైల్)

సైదాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గుడికి వెళ్తున్నానని బయటకు వెళ్లిన మహిళ ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చంపాపేట ఎస్‌ఎన్‌రెడ్డి నగర్‌లోని ఎస్‌వీఆర్‌ఎస్ నీలాద్రి అపార్ట్‌మెంట్‌లో నివాసముండే వ్యాపారి అరవింద్‌కుమార్ భార్య మీనా(42) ఈనెల 20న సాయంత్రం 6.30గంటల సమయంలో కర్మన్‌ఘాట్ గుడికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. ఇంటికి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెదికినా దొరకలేదు. దీంతో భర్త సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాగోల్‌లో సెక్యూరిటీ గార్డు..



అశోక్‌కుమార్(ఫైల్)

కొత్తపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధిలో ఉండే సెక్యూరిటీ గార్డు విధులకు వెళ్లి తిరిగి రాని సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ సాయినగర్ గుడిసెల్లో ఉండే నేనావత్ అశోక్‌కుమార్(26) మల్లాపూర్ స్టాక్ యార్డు కార్స్ గోడౌన్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడు ఈనెల 20న ఉదయం 8గంటలకు విధులకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం తల్లి నేనావత్ అచ్చలీ అంతటా వెతికినా ఫలితం దక్కలేదు. అతడికి ఫోన్ చేసినా ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు సమాధానం రావడంతో అచ్చలీ బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

26న కృష్ణస్వామి జయంతి వేడుకలు

పద్మారావునగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర తొలిమేయర్ కొర్వి కృష్ణస్వామి జయంతి వేడుకలను ఈ నెల 26వ తేదీన సికింద్రాబాద్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు డి.సదానంద్, జి.దివాకర్, శ్రీకాంత్, సురేష్, నర్సింగరావులు మాట్లాడుతూ తెలంగాణ ముదిరాజ్ మహాసభ, కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి మహోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, మాజీ శాసనసభ సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్ హాజరవుతారని తెలిపారు.

రేపు ఈఎంఆర్ఐలో ఉద్యోగ ఇంటర్వ్యూలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ (108) సంస్థలో డ్రైవర్లు, మెడికల్ టెక్నీషియన్ల నియామకాలను చేపడుతున్నట్లు ఈఎంఆర్ఐ ప్రోగామ్ మేనేజర్ షేక్ జాన్ షాహీద్ తెలిపారు. ఈ నెల 24న కింగ్‌కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రైవర్ కోసం వయసు 23-35 సంవత్సరాలు, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. మెడికల్ టెక్నీషియన్ కోసం అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని డీ ఫార్మసీ, నర్సింగ్‌తో పాటు ఇతర ఆరోగ్యశాఖకు సంబంధించిన డిప్లమా చదివి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు ఒక జత జీరాక్స్ సెట్‌ను తీసుకు రావాలని తెలిపారు.

అందుబాటులోకి మెట్రో డీలక్స్ మంత్లీ పాస్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ జోన్ ప్రయాణికుల సౌకర్యార్థం గురువారం నుంచి మెట్రో డీలక్స్ మంత్లీ బస్‌పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీజీఎస్‌ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. పాస్‌తో మెట్రోడీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. పాస్‌హోల్డర్లు సిటీ, సబర్బన్ పరిధుల్లో తిరిగే అన్ని బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించవచ్చన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ముంబైకి వెళ్లబోయిన బాలిక

- నాంపల్లి రైల్వే స్టేషన్‌లో చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు



బాలికను చేరదీసిన నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు మందలించారన్న నెపంతో ఓ బాలిక గుట్టుచప్పుడు గాకుండా ముంబైకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన మహ్మద్ జాహంగీర్ కుమార్తె(17) ఇంట్లో కుటుంబ సమస్యలు, తల్లిదండ్రులు మందలిస్తున్నారన్న నేపథ్యంతో బాలిక గురువారం ఎవరికీ చెప్పకుండా ఒంటరిగానే ముంబైకి వెళ్లేందుకు నాంపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు బాలికను చేరదీసి వివరాలను సేకరించారు. బాలికను ప్రభుత్వ చైల్డ్‌లైన్ హోమ్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కుమార్తెను అప్పగించేందుకు చైల్డ్‌లైన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, ఆటోనగర్ నుంచి పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించండి

వనస్థలిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్, ఆటోనగర్ నుంచి పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వంద సంవత్సరాల నుంచి ఉన్నటువంటి ఈ రోడ్డు గత ఇరువై ఏళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ అధికారులు మూసివేయడం జరిగిందన్నారు. ఈ రోడ్డును పునరుద్ధరించడం వల్ల వంద కాలనీల ప్రజల వాహనాల రాకపోకలకు మేలు జరుగుతుందన్నారు. ఈ రోడ్డును తక్షణమే పునరుద్ధరించి కాలనీవాసుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక చొరవతీసుకోవాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో ఉట్టి అశోకప్ప, ఉపేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌సింగ్, కొండల్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్‌లోని రాఘవేంద్రస్వామి మఠంలో నిర్వహించిన స్వామివారి ఆరాధన కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు అని, కొంత సమయాన్ని దేవాలయాల సందర్శనకు కేటాయించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ గురువు లక్ష్మీనారాయణ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



వినాయక నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్

వినాయక నిమజ్జన ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలి

వనస్థలిపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ఏర్పాట్లు త్వరితగతిన చేపట్టాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం కార్పొరేటర్ పలు విభాగాల అధికారులతో కలిసి నాగోల్ చెరువులో కొలను ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ చెరువులోకి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వినాయకులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా సంబంధిత అధికారులు పటిష్ట ప్రణాళికలతో నిమజ్జన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ సుధీర్‌కృష్ణ, ఈఈ రమేష్‌బాబు, ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో బీసీ నిరుద్యోగ యువతకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద బీసీ నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నాన్ రెసిడెన్షియల్ కింద శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తెలిపారు. కుషాయిగూడలోని ఎల్‌జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 30 వరకు వంద మంది అభ్యర్థులకు ట్రైనింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌లు లభిస్తాయన్నారు. టెన్త్, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు ఈనెల24లోపు www.tgbcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, ఎస్‌ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.



లైంగిక దాడి కేసుల్లో నిందితులకు గరిష్ట శిక్షపడేలా మంచి పనితీరు కనబరిచిన సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సన్మానించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి